జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

మంగళవారం 06-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :220 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : కాసే అమృత

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

## పోలవరం - నల్లమల సాగర్‌పై సుప్రీంలో వాదనలు..



### విచారణ 12కి వాయిదా

దిల్లీ: పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. "ఏపీ ప్రభుత్వం వరద జలాలే వాడుకుంటామని చెబుతోంది. పేజి 2లో

## మచాడో అధ్యక్ష కలకు అడ్డుపడిన 'నోబెల్'..

ట్రంప్ నిర్ణయానికి కారణమిదేనా..?


2లో

# ఓఎన్‌జీసీ పైపులైన్‌లో గ్యాస్ లీక్

భారీగా ఎగిసిపడ్డ మంటలు

అప్రమత్తం అయిన అధికారులు




మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ పైపులైన్ నుంచి గ్యాస్ లీకై భారీగా మంటలు ఎగసిపడ్డాయి. గ్యాస్ గాలిలోకి ఎగజిమ్మడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అది చూసి గ్రామస్థులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో మండల తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీక్ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే పని మొదలు పెట్టారు. మలికిపురం మండలంలో గ్యాస్ లీకేజ్ విషయంపై మంత్రి సుభాష్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. పేజి 2లో

## ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

ఐనవోలు మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. సిఎంను సోమవారం కలిసిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆహ్వానపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఐనవోలు పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు.





## మంత్రలుతో కలసి బస్సులో సిఎం ప్రయాణం

సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ బస్సులో బస్సులో ప్రయాణించారు. శాసనసభ సమావేశాల అనంతరం అసెంబ్లీ నుంచి బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ వరకు మంత్రులతో కలిసి ఆయన బస్సులో ప్రయాణం చేశారు. ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించిన 'ఫులే' సినిమాను మంత్రులు, సీనియర్ నేతలతో కలిసి సీఎం వీక్షించారు.

## మహిళా సాధికారితకు పెద్దపీట



మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి

ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా

ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్పాలన్నదే లక్ష్యం

ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం


## ఆ 17 మంది లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ: డీజీపీ


2లో

## గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

**తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం**

అమరావతి, అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకేజీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. పేజి 2లో



## రాష్ట్రంలో విస్తృతంగా అందుబాటులోకి సోలార్ పవర్

- వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం
- పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే
- మండలిలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి

రాష్ట్రంలో సోలార్ పవర్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు.



## కవిత పార్టీ పెట్టడం వల్ల మాకు నష్టమేమీ లేదు: రామచందర్‌రావు


2లో

## "పోలవరం-నల్లమల"ను అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

2లో

## తెలుగువారు అయ్యుండి.. తెలుగు మాట్లాడకపోతే లోపం ఉన్నట్లే: వెంకయ్యనాయుడు



గుంటూరు: రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలను గుర్తించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. గుంటూరులో మూడో తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. గొప్పవారంతా తమ మాతృభాషలో చదువుకొనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వెంకయ్యనాయుడు తెలిపారు. తెలుగు భాష సజీవంగా ఉంచేందుకు ఎంతో మంది కృషి చేశారని కొనియాడారు.

"నన్నయ్య, తిక్కన్న, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, ఉన్నవ లక్ష్మనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, ఎన్టీ రామారావు, రామోజీరావు.. పేజి 2లో

# రాష్ట్రంలో విస్తృతంగా అందుబాటులోకి సోలార్ పవర్



మొదటి పేజీ తరువాయి

పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ.519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. 'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 బూటఇ పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

## మహిళా సాధికారితకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్ సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సంఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు

ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు అందరినీ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళలందరినీ ఒక వ్యవస్థలోకి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహిళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

## కవిత పార్టీ పెట్టడం వల్ల మాకు నష్టమేమీ లేదు: రామచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుందని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని అన్నారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని చెప్పారు. ఆమె ఆత్మగౌరవం ఎలా దెబ్బతిందో అది వారి కుటుంబ అంశమని, ఆమె పార్టీ పెట్టడం వల్ల మాకు వచ్చే నష్టం ఏమీ లేదని అన్నారు. ప్రజలు భాజపా వైపు చూస్తున్నారని చెప్పారు.వీబీ జీ రామ్‌ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రామ్‌చందర్‌రావు వ్యతిరేకించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవరికీ మంచి జరగలేదన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. పారదర్శకత లేని స్కీమ్‌లే కాంగ్రెస్ ఉండాలని కోరుకుంటుందని విమర్శించారు.

## "పోలవరం-నల్లమల"ను అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: పోలవరం-నల్లమల సాగర్‌ను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చూపిస్తున్న లేఖకు దీనికి సంబంధం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరం-నల్లమల.. ఇంటర్‌స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ)కు లేఖ రాసినట్టు చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

"మా అభిప్రాయంతో జీఆర్ఎంబీ కూడా సమర్థించింది. పోలవరం-నల్లమల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తోంది. సుప్రీంకోర్టులో వాదనలు బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సూచించాం. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. రిట్ పిటిషన్‌లో కాదు, సూట్ పిటిషన్‌లో రావాలని మాకు సుప్రీంకోర్టు సూచించింది. వచ్చే విచారణకు నేను స్వయంగా హాజరవుతా. ఈ కేసులో స్టే ఇవ్వాలని కోర్టును కోరుతాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగింది. గతంలో ఆగి ఉండే భారాస ప్రభుత్వం ఎందుకు చెప్పలేదు? అతి తెలివితో భారాస తెలంగాణకు భారీ నష్టం చేసింది. పాలమూరు – రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం తెచ్చారు"అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

మొదటి పేజీ తరువాయి

ఈ విషయంపై మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. తాము ఇప్పటికే లీకేజీ ఘటనపై స్థానిక అధికారులతో మాట్లాడామని.. సహాయ చర్యలను ముమ్మరం చేయాలని సూచించినట్లు సీఎంకు మంత్రులు వివరించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని... సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంటలను వెంటనే అదుపులోకి తెచ్చేలా చూడాలన్నారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులకు, అధికారులకు సీఎం సూచించారు. పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కాగా.. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ గ్యాస్ లీకేజ్ అవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిస్థితిపై అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. భద్రతా చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. అలాగే సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ మహేశ్ కుమార్ ఆదేశించారు.

## మచాడో అధ్యక్ష కలకు అడ్డుపడిన 'నోబెల్'..

మొదటి పేజీ తరువాయి

వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించగానే ప్రతిపక్ష నేత మారియా కొరీనా మచాడో చేసిన ప్రకటన ఆసక్తి కలిగించింది. 'ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తోన్న స్వేచ్ఛ లభించింది. దేశాన్ని తిరిగి నిర్మిస్తాం' అంటూ అధికారం అందుకునేందుకు సిద్ధమనే సంకేతాలు పంపించారామె. కానీ, ఆమె కలలను ట్రంప్ కల్లలు చేశారు. అధ్యక్ష బాధ్యతలను మచాడోకు అప్పగించేందుకు విముఖత వ్యక్తం చేశారు. దేశంలో ఆమెకు సరైన మద్దతు లేదని ట్రంప్ చెప్పినప్పటికీ.. అసలు కారణం మచాడో అందుకున్న 'నోబెల్ బహుమతే' అనే ప్రచారం జరుగుతోంది.దీనిపై వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించిన కథనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతేడాది నోబెల్ కమిటీ మచాడోకు శాంతి బహుమతి ప్రకటించిన సంగతి తెలిసిందే. దాన్ని ఆమె అంగీకరించడం ట్రంప్‌నకు కోపం తెప్పించిందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించినట్లు ఆ కథనం పేర్కొంది. "ఆ బహుమతిని స్వీకరించడమే ఆమె చేసిన పాపం. నోబెల్ కమిటీ ప్రకటించగానే ఆమె దాన్ని తిరస్కరించాల్సింది. ఆ పురస్కారానికి ట్రంప్ మాత్రమే అర్హుడని చెప్పాల్సింది. అలా చేసుంటే ఈ రోజు కచ్చితంగా వెనెజువెలా అధ్యక్షురాలు అయ్యేవారు" అని సదరు వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది.మాట వినకుంటే మదురో కంటే ఘోరమైన గతి.. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలికి ట్రంప్ వార్నింగ్

వెనెజువెలా అధ్యక్ష బాధ్యతలను తాత్కాలికంగా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇందుకు అమెరికా కూడా సుముఖత వ్యక్తం చేసింది. "ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వెనెజువెలా బాధ్యతలను వేరేవారికి అప్పగించే ఛాన్స్ తీసుకోం. అది ఆ దేశ ప్రజలకు మంచిది కాదు" అని ట్రంప్ వెల్లడించారు. చమురు పరిశ్రమలోని రిపబ్లికన్లతో, వాల్‌స్ట్రీట్‌తోనూ ఆమెకు మంచి సంబంధాలే ఉన్నట్లు సమాచారం. దీనినిబట్టి వెనెజువెలా అధ్యక్షురాలిగా డెల్సీ కొనసాగే అవకాశం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, మదురో నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఆమె చేసిన ప్రకటన అమెరికా అధ్యక్షుడిని అసహనానికి గురిచేసింది. ఈ పరిణామాలతో వెనెజువెలా పాలనపై ట్రంప్ నిర్ణయం ఎలా ఉంటుందోనన్న ఆసక్తి నెలకొంది.

## మన విద్యా విధానం వల్లే తెలుగు భాషకు కష్టాలు: జస్టిస్ ఎన్వీ రమణ

మొదటి పేజీ తరువాయి



అభివృద్ధి చెందిన దేశాలన్నీ వారి భాషలోనే పనులు చేసుకుంటున్నాయి. చైనా, రష్యా, జపాన్, జర్మనీని చూసి అందరూ నేర్చుకోవాలి. ఆంగ్ల భాష వల్లే ఉద్యోగాలు వస్తాయన్న అపోహలు వీడాలి. తెలుగులో చదువుకున్న వారు కూడా ఉన్నతస్థితికి వెళ్లారు. పిల్లలకు మాతృభాషను దూరం చేయొద్దని తల్లిదండ్రులను కోరుతున్నా. ఆంగ్ల భాష వినియోగం పెరిగితే మళ్లీ మనం బానిసలమవుతాం" అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.

## ఓఎన్‌జిఎసి పైపులైన్‌లో గ్యాస్ లీక్

మొదటి పేజీ తరువాయి

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఆగస్టులోనూ ఇదే గ్రామంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ అయ్యింది. ఇక్కడ తరుచూ గ్యాస్ లీక్ అవుతున్న సంఘటనలు జరుగుతుండడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా దీని వల్ల తీవ్ర ప్రమాదం జరగొచ్చని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని.. లేదంటే గ్రామ ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ లీక్ ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఓఎన్జీసీ సిబ్బంది ్ ÷ర్ ఇంజన్లతో మంటలు కంట్రోల్ చేస్తున్నారు.

## కాళేశ్వరం కట్టినా తాము అడ్డుచెప్పలేదు

మొదటి పేజీ తరువాయి

ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామని వెల్లడించారు. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టామని వివరించారు. ఆంధ్ర ప్రాంతంలో చాగల్‌నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తీసుకువచ్చామని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చామని అన్నారు. విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ప్రత్యేక నిధులు ఇచ్చిందని వివరించారు, ప్రత్యేక చట్టం రూపొందించిందని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు.గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గోదావరి నీళ్లను తెలంగాణ వాడుకున్నా

తాను ఏనాడు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదని అన్నారు. ప్రతి ఏడాది గోదావరి నుంచి సముద్రంలోకి మూడువేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పుకొచ్చారు. కృష్ణా–గోదావరి నదులు అనుసంధానం జరుగుతుందని వెల్లడించారు. ఏపీలోని నదులన్నింటినీ అనుసంధానించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి... అన్ని మాట్లాడటం లేదని అన్నారు..ఐక్యత గురించే తాను మాట్లాడతానని చెప్పుకొచ్చారు. నీటి విషయంలోనైనా, సహకారం విషయంలోనైనా తెలుగువారంతా కలిసి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినప్పుడు తాను అడ్డుపడలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు.. సమైక్యత అవసరమని చెప్పుకొచ్చారు. నీటి విషయంతో పాటు ఇతర అంశాల్లో తెలుగువారు కలిసే ఉండాలని సూచించారు. గంగా–కావేరి కలవాలని.. దేశంలో నీటి సమస్య పూర్తిగా తీరాలని.. అదే తన కోరిక అని చెప్పుకొచ్చారు. గోదావరి–పెన్నా నదుల అనుసంధానం కావాలని అన్నారు. గోదావరి నీటిని తెలంగాణ వాడుకుంటే ఎప్పుడూ అడ్డుచెప్పలేదని వ్యాఖ్యానించారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తన హయాంలో.. తెలంగాణలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## తెలుగువారు అయ్యుండి.. తెలుగు మాట్లాడకపోతే లోపం ఉన్నట్లే: వెంకయ్యనాయుడు

మొదటి పేజీ తరువాయి

ఇలా చాలా మంది మహనీయులు తెలుగు భాష ఉన్నతి కోసం శ్రమించారు. తెలుగువారు అయ్యుండి తెలుగు మాట్లాడకపోతే ఏదో లోపం ఉన్నట్లే లెక్క. అమ్మ అంటే అంతరాళం నుంచి వస్తుంది. అదే మమ్మీ అంటే నోటి నుంచి మాత్రమే వస్తుంది. మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని మరచినవారు పరిపూర్ణ మానవుడు కాదు. ఈతరంలో తెలుగు భాష నేర్చుకోవాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. గుడి, బడి, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాతృభాషలోనే చదువుకున్నారు. మాతృభాషను మరిచిపోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాషను కాపాడుకోవాలంటే తెలుగులో మాట్లాడితే చాలు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ఇతర దేశాల్లో సాంకేతిక విద్య, ఇతర విద్యా కోర్సులు వారి మాతృభాషలోనే ఉంటున్నాయి. మన దేశంలోనూ ప్రధాని మోదీ మాతృభాషలోనే సాంకేతిక కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానిక ప్రభుత్వాలు కూడా మాతృభాషలోనే ఉత్తర్వులు ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగు అమలు చేయాలి. న్యాయస్థానాల్లో తెలుగు భాషను అమలు చేస్తే చాలా బాగుంటుంది" అని వెంకయ్య నాయుడు తెలిపారు.

## ఆ 17 మంది లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ: డీజీపీ

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ వాళ్లు 17 మంది ఉన్నారని, వారంతా లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 17 మందిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితోపాటు మరొకరు ఉన్నారని వెల్లడించారు. వారిలోఐదుగురు మహిళలున్నట్లు తెలిపారు. 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.25 కోట్ల రివార్డు ఉందన్నారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ కగార్ గడువులోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రం అవుతుందని చెప్పారు.

## పోలవరం - నల్లమల సాగర్‌పై సుప్రీంలో వాదనలు..

మొదటి పేజీ తరువాయి

కేటాయింపులకు విరుద్ధంగా నీటి వినియోగం సాధ్యపడదు. ఇందుకు సంబంధించి అనేక విషయాలు ముడిపడి ఉంటాయి. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. ప్రాజెక్టులు అన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయి. పిటిషన్ దాఖలు తర్వాత కేంద్రం కమిటీని నియమించింది" అని సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు.

### అభ్యంతరం ఎందుకు?

ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. "భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు – నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు" అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు.

# అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలి

**లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు**



**సూర్యాపేట (సందేశం టైమ్స్):** అంధుల కోసం అక్షరాల ద్వారా వెలుగులు నింపిన మహానుభావుడు లూయిస్ బ్రెయిలీని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు అన్నారు. జనవరి 4న లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని, సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం లూయిస్ బ్రెయిలీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రెయిలీ లిపిని ఆవిష్కరించిన లూయిస్ బ్రెయిలీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 4న ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. బ్రెయిలీ లిపి ఆవిష్కరణ వల్ల ప్రపంచవ్యాప్తంగా అంధులు మెరుగైన జీవితం గడుపుతున్నారని, చదవడం, రాయడం వంటి అవకాశాలు విస్తృతంగా లభించాయని పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ చిన్నతనంలో ఎదుర్కొన్న ఇబ్బందులే అతడిని బ్రెయిలీ లిపి ఆవిష్కరణ వైపు నడిపించాయని, భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 175 ఏళ్ల క్రితమే అంధ సమాజం కోసం ముందుచూపుతో ఆలోచించిన మహానుభావుడు బ్రెయిలీ అని ప్రశంసించారు. అంధులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ అంధులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ అశోక్, డి.ఐ.ఈ.ఓ భాను నాయక్, డి.టి.డి.ఓ శంకర్, ఈ.డి.ఎస్.సి కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, డి.యస్.డి.ఓ దయానంద రాణి, డి.బి.సి వెల్ఫేర్ ఆఫీసర్ టి. నర్సింహులు, జిల్లాలోని అంధులు, అంధుల సంఘాల ప్రతినిధులు ఎ. శ్రీనివాస్, సి.హెచ్. సోమయ్య, రవీందర్, వెంకటయ్య, ప్రభుత్వ అంధ దివ్యాంగ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి గ్రీవెన్స్ డే..

**– ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ..**
**– ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయండి.., బాధితులకు భరోసా కల్పించండి..**
**– ఎస్.హెచ్.ఓలకు ఫోన్ ద్వారా పలు సూచనలు..**
**– జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్..**



**సందేశం టైమ్స్: సంగారెడ్డి టౌన్ ప్రతినిధి 5 జనవరి** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రాజావాణి కార్యక్రమాన్ని నిర్వహిచడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సమస్యలతో జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదిదారుల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యను విని, సమస్యకు కారణమవుతున్న అంశాలపై సంబంధిత ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కేసును పారదర్శకంగా దర్యాప్తు చేసి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ ఎస్.హెచ్.ఓలకు సూచించడం జరిగింది. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మీ సమస్యలు స్థానిక పోలీస్ స్టేషన్‌లలో పరిష్కారం కానప్పుడు ఎలాంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోనుకాకుండా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా సమీక్షస్తూ, వాటి పురోగతిని పర్యవేక్షస్తూ, త్వరిత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# బోరంచ గ్రామంలో మహిళా సమాఖ్య భవనానికి తీర్మానం



**సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 5జనవరి సంగారెడ్డి జిల్లా** నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పి. సంజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప తెలిపారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ మొల్ల కరిమ్, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన గ్రామ మహిళా సమాఖ్య భవనాలపై చర్చించారు. బోరంచ గ్రామంలో మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి సంబంధించి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. ఈ తీర్మానాన్ని గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, ఉపసర్పంచ్ మొల్ల కరిమ్ చేతుల మీదుగా గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సాయమ్మకు, సభ్యురాలు రుక్మిణికి, వీఓఏకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ,"మహిళా సమాఖ్య భవనం గ్రామ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని గ్రామ అభివృద్ధికి అందరం కలిసి పనిచేయాలి" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు భద్రతపై అవగాహనే లక్ష్యం

**– సూర్యాపేటలో న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో చట్టపరమైన అవగాహన కార్యక్రమం, రోడ్డు భద్రతా ర్యాలీ**




**సూర్యాపేట (సందేశం టైమ్స్):** జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ చైర్మన్ పి. లక్ష్మ శారద గారి ఆదేశాల మేరకు, న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఫర్వీన్ కౌసర్ గారి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథరిటీ, సురక్ష అభియాన్ / రహస్య భద్రత అభియాన్ కింద జనవరి 05, 2026న సూర్యాపేట కోర్టు ఆవరణ ముందు చట్టపరమైన అవగాహన కార్యక్రమం మరియు రోడ్డు భద్రతా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి/న్యాయ సేవల అధికార సంస్థ కార్యదర్శి ఫర్వీన్ కౌసర్, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, మొదటి అదనపు జిల్లా జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. మమతా గారు పాల్గొన్నారు. కోర్టు సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, పేరా లీగల్ వాలంటీర్లు, ట్రాఫిక్ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది కలిసి రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి ఫర్వీన్ కౌసర్ గారు కూడలిలో అందరితో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కొంపల్లి లింగయ్య, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ / చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సుంకరబోయిన రాజు, డి.ఎల్.ఎస్.ఎ నామినేటెడ్ మెంబర్స్ గుంటూరు మధు, అల్లమనేని వెంకటేశ్వరరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సంరక్షణఉవిద్యతోనే సామాజిక సాధికారత

**'బేటీ బచావోఉబేటీ పడావో' అవగాహన కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ చైతన్య**



**జాజిరెడ్డిగూడెం మండలం (సందేశం టైమ్స్):** జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా శిశు సంక్షమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం నిర్వహించిన 'బేటీ బచావో ఉ బేటీ పడావో' అవగాహన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కో-ఆర్డినేటర్ చైతన్య మాట్లాడుతూ, సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షను పూర్తిగా తొలగించి, వారికి నాణ్యమైన విద్య అందించడం ద్వారానే నిజమైన సామాజిక సాధికారత సాధ్యమవుతుందని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని విద్యార్థులకు వివరించారు. ఆడపిల్లలను రక్షించడం (బేటీ బచావో), వారికి విద్య అందించడం (బేటీ పడావో) ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్యే ఏకైక మార్గమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు వినోద్, భవ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో పెద్దారెడ్డిపేట గ్రామం

**సందేశం టైమ్స్: అందోల్ నియోజకవర్గం ఇంచార్జి 5జనవరి సంగారెడ్డి జిల్లా**



పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట గ్రామం అభివృద్ధి దిశగా ముందుకెళ్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామ సర్పంచ్ కుమ్మరి అనసూజ లింగయ్య అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ, ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి బోర్లు వేయించడం, మురుగు నీటి కాలువల నిర్మాణం, సీసీ రోడ్లు, కరెంట్ స్తంభాల ఏర్పాటు, భద్రత కోసం సీసీ కెమెరాల స్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. సమస్యలు చెప్పిన ప్రతి కుటుంబానికి "మీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం" అని భరోసా ఇస్తూ ముందుకెళ్తున్న సర్పంచ్ పనితీరుపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వార్డు సభ్యుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని గ్రామ పాలకవర్గం స్పష్టం చేయడంతో పెద్దారెడ్డిపేట గ్రామం అభివృద్ధి బాటలో దూసుకెళ్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మెదక్ జిల్లా సర్పంచుల ఫోరం కార్యవర్గం ఏర్పాటు

**సందేశం టైమ్స్: సంగారెడ్డి టౌన్ ప్రతినిధి 5జనవరి**





మెదక్ జిల్లాలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చక్కటి వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన జిల్లా సర్పంచుల ఫోరం కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివంపేట గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్లు జిల్లా సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా, అలాగే పెద్ద గొట్టిముక్ల గ్రామ సర్పంచ్ ఎం. నవీన్ను జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఆవుల గోపాల్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్ చిలుమూల సువాసిన్ రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు మైపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ మాట్లాడుతూ "సర్పంచుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తాం" అంటూ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్ కుంపులో విజయం సాధించిన అందోల్ విద్యార్థులు

**సందేశం టైమ్స్ : సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 5 జనవరి**




అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కుంపు మార్షల్ ఆర్ట్స్‌లో విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో విజయం సాధించారు. ఆదివారం సంగారెడ్డిలో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బెల్ట్ పరీక్షల్లో పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు బెల్ట్ సర్టిఫికెట్లు సాధించగా, ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దేవిదాస్ మాట్లాడుతూ "మార్షల్ ఆర్ట్స్ వంటి యుద్ధక్రీడల్లో విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు రాణించడం ద్వారా ఆత్మస్థైర్యం పెరిగి జీవితంలో ఉన్నత విజయాలు సాధించగలుగుతారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ మురళి, పీటీ కృష్ణతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

# మహిళా శక్తి చీరలను పంపిణీ చేసిన బహిరన్ దిబ్బ గ్రామ సర్పంచ్ పంపాటి వీరప్ప

**సందేశం టైమ్స్ : నారాయణఖేడ్ ఇంచార్జ్5జనవరి**



అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ లోని పంచాయతీ కార్యాలయం వద్ద ఇందిరమ్మ మహిళల శక్తి పథకం కింద మంజూరైనా చీరలను సర్పంచ్ వీరప్ప పంపిణీ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తూ నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుంది అని పేర్కొన్నారు. మహిళా సంఘాలలో ప్రభుత్వం చేపడుతున్న. పథకాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఉప్ప సర్పంచ్ గ్రామ పెద్దలు యువకులు నాయకులు పాల్గొన్నారు.

# మైనర్ అమ్మాయిల జోలికి వెళ్ళేవారికి కఠిన హెచ్చరిక

**- కంగ్టి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి**

**సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి5జనవరి**




ఇటీవల యువతలో చిన్నపెద్ద తేడా లేకుండా మైనర్ అమ్మాయిల జోలికి వెళ్లడం, మాటలు చెప్పి వెంట పడడం, చివరకు తీస్తుళ్ళే ప్రయత్నాలు పెరుగుతున్నాయి.ఇలాంటి చర్యలు పిల్లల భవిష్యత్తుకు ఘాతుకరమైన నష్టాన్ని తెచ్చే అవకాశం ఉంది. కంగ్టి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి హెచ్చరిస్తున్నారు,ఎవరైనా మైనర్ అమ్మాయిని తీస్తుళ్లినా లేదా తీస్తుళ్లేందుకు సహకరించినా పోకో చట్టం ప్రకారం 14 ఏళ్ల నుండి యావజీవ శిక్ష తప్పదు. ఈ చట్టం కేవలం తీస్తుళ్లడాన్ని మాత్రమే కాక, సహకరించడం, ప్రేరేపించడం కూడా కవర్ చేస్తుంది.తల్లిదండ్రులు పిల్లలపై మరింత శ్రద్ధ చూపాలి. ఫోన్లు, చాటింగ్, సామాజిక సంబంధాలు అన్నీ గమనిస్తూ, ప్రమాదం జరిగే అవకాశాలను తగ్గించాలి. యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలి.

# పోరాటాలు త్యాగాలతో నిండిన సిపిఐది వందేళ్ల చరిత్ర

**- ఖమ్మం నగరంలో ఐదులక్షల గొంతుకలు రణన్నినాదం**
**- 18న ఖమ్మంలో చారిత్రాత్మక సభ**
**- కమ్యూనిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం వందేళ్ల ముగింపు ఉత్సావాలు**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా**
**- మూడోరోజు లక్ష్మదేవిపల్లి మండలంలో ఉత్సాహంగా ప్రచారజాతా**




**లక్ష్మదేవిపల్లి జనవరి 5 సందేశం టైమ్స్**

జనవరి 18న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంతాల ముగింపుసభ ఐదు లక్షల గొంతుకలు రణన్నినాదమని, భవిష్యత్తు ప్రజా పోరాటాలకు ఖమ్మం సభ ప్రేరణగా నిలవబోతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. ఖమ్మం వహిరంగ సభ విజయంతంకోసం సిపిఐ జిల్లా సమితి చేపట్టిన ప్రచారజా జాతా మూడోరోజైన సోమవారం లక్ష్మదేవిపల్లి మండలంలో జరిగింది. మండలంలోని అనిశెట్టిపల్లి, సీతారాంపురం గ్రామ సెంటర్లలో జరిగిన సభల్లో సాబీర్ పాషా మాట్లాడారు. వందేళ్ల కమ్యూనిస్టు చరిత్రను కేవలం జ్ఞాపకంగా కాకుండా భవిష్యత్ పోరాటాలకు పునాది చేయాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ శతాబ్ద కాల చరిత్ర ప్రజల కోసం చేసిన త్యాగాలు, పోరాటాలతో నిండి ఉందని ఆయన అన్నారు. కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న అసమానతలు, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు అవసరమని పిలుపునిచ్చారు. జనవరి 18న జరిగే బహిరంగ సభకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ప్రజలు దండుగా కదలిరావాలని ఆయన కోరారు. ఈ సభ కమ్యూనిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక సభగా నిలవబోతోందని అన్నారు. ప్రచారజాతలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్ రావు, చంద్రగిరి శ్రీనివాసరావు, ఫహీయం, దీటి లక్ష్మపతి, అజిత్, నూనావత్ గోవిందు, జర్పుల ఉపేందర్, బిబి, సపావట్ రవి, జలీల్ పాషా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లాదుర్గ్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం






**సందేశం టైమ్స్: సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 5జనవరి**

జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్ సందర్భంగా అల్లాదుర్గ్ నేషనల్ హైవే అండర్పాస్ వద్ద ప్రత్యేక రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో అల్లాదుర్గ్ సీఐ రేణుక,ఎస్ఐ శంకర్ వాహనదారులను ఉద్దేశించి, రోడ్డు భద్రతకు సంబంధించిన ముఖ్యమైన సూచనలు మరియు సూచనలను అందించారు.వాహనదారులకు హెల్మెట్ ధరించడం మరియు సీట్ బెల్ట్ ఉపయోగించడం తప్పనిసరి అని, అదనంగా మద్యం తాగిన తరువాత వాహనం నడపకూడదని స్పష్టంగా వివరించారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు ప్రజలను ప్రోత్సహించడం, భద్రతా నిబంధనల పట్ల శ్రద్ధ చూపించడం లక్ష్యంగా ఉంది.కార్యక్రమంలో హెల్మెట్ ధరించిన వాహనదారులను శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా వాహనదారులందరికీ రోడ్డు భద్రతపై అవగాహన పెంచడమే కాకుండా, భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించడానికి ప్రజలను ప్రేరేపించడం జరిగింది. అల్లాదుర్గ్ అండర్పాస్ వద్ద ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేయబడింది.

# ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంత ఎస్సీల రిజర్వేషన్ పై ప్రస్తావించాలి

**- లేనిపక్షంలో ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు**
**- షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్**

**కొత్తగూడెం జనవరి 5 సందేశం టైమ్స్**

పాలన సౌలభ్యం కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కొత్తగూడెం అంబేద్కర్ భవనంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పత్రిక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 2025 డిసెంబర్ లో జరిగిన స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వేషన్ తొలగించడమే కాకుండా జడ్పిటిసి,ఎంపీటీసీ,ఏజెన్సీ జిల్లాల్లో ఎమ్మెల్యే స్థానాలు లేకుండా చేసే కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉమ్మడి ఖమ్మం, వరంగల్ ,ఆదిలాబాద్,మహబూబ్నగర్ వరకు 18 నియోజకవర్గాల్లో ఎస్సీలకు అన్యాయం,అవమానం,అభివృద్ధి పై వివక్షత జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు శీతాకాల అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎస్సీలకు జరుగుతున్న అన్యాయంపై నియోజకవర్గాల ఎమ్మెల్యేల తోపాటు,ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 18 మంది ఎస్సీ ఎమ్మెల్యేలు ఏజెన్సీ ప్రాంతలో హక్కులు కోల్పోయిన ఎస్సీల పక్షన అసెంబ్లీలో ప్రభుత్వం ముందు ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు.ఇప్పటివరకు ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు జరుగుతున్న అన్యాయం పై అసెంబ్లీలో ప్రస్తావించిన కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనశీనేని సాంబశివరావు,ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కు బొమ్మెర శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల సమస్యను పట్టించుకోని



పక్షంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నాలు చేసే కార్యక్రమం పెడతామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డా తరువాత ఏజెన్సీ ప్రాంతం పేరుతో ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ ఉద్యోగ,ఉపాధి,రాజకీయ రిజర్వేషన్ తో పాటు నివాసముంటున్న ఇంటిపై,సాగు భూములకు హక్కులు లేకుండా అంధకారంలోకి నెట్టివేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెపుతామని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత మంత్రులకు ఇప్పటివరకు ఈ విషయాన్ని ఎన్నో దపాలుగా ముందు ఉంచామని గుర్తు చేశారు.ఇంతకాలం ప్రభుత్వం స్పందిస్తాదని ఎదురు చూస్తున్నాం ఇకముందు జరగబోయే పోరాటంలో పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.ఈ సమావేశంలో షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట జేఏసీ రాష్ట్ర నాయకులు సలిగంటి కొమరయ్య,జిల్లా అధ్యక్షులు శిలుముల గోపి కిరణ్, ఇంటికాపల్లి శంకర్,ఆర్ నరసయ్య,ఉండేటి దేవరాజు, తెలంగాణ ఉద్యమ నాయకులు మ్యాచెస్, రాజయ్య,కండె రాములు,చిరంజీవి, ఇనుముల సమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.

# పోచారం మల్లన్న జాతరలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్



**సందేశం టైమ్స్ :సంగారెడ్డి టౌన్ ప్రతినిధి జనవరి 05**

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామంలో సోమవారం ఘనంగా శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం మరియు మల్లన్న జాతర నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, వీణ= ఫౌండేషన్ కోఉఫౌండర్ మరియు బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రాంత ప్రజలందరికీ ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు కలగాలని వారు ఆకాంక్షంచారు. జాతరలో పాల్గొన్న భక్తులతో ఆత్మీయంగా మమేకమై, గ్రామీణ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని వారు వివరించారు.ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ,"మన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలే సమాజానికి దిశానిర్దేశం చేస్తాయి. ఇలాంటి జాతరలు ప్రజలను ఐక్యతతో ముందుకు నడిపిస్తాయి" అని అన్నారు.అనంతరం ఆలయ నిర్వాహకులు మాద్రి పృథ్వీరాజ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

**- పొట్టకూటి కోసం వెళ్లిన వారికి చేదు అనుభవం**

**అశ్వరావుపేట జనవరి 5 సందేశం టైమ్స్**

పొట్ట కుట్టి కోసం వలస వెళ్లిన ఆ కుటుంబానికి చేదు అనుభవం ఎదురయింది. ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు దొరక ఇల్లు కట్టడమే కష్టంగా మారిన ఆ కుటుంబం పని వెతుక్కుని వేరే ప్రాంతానికి వెళ్తే అక్కడ అనుకోని సంఘటన జరిగి ఇప్పుడు నాన్న ఇబ్బందులు పడుతున్నారు. పూట గడవడమే కష్టంగా మారిన ఆ



కుటుంబం పై తమ కుమార్తె ఆసుపత్రి ఖర్చులకు డబ్బులు లేక సతమతమవుతున్నారు దాతలు ఎవరైనా ముందుకొచ్చి సాయం చేస్తారేమో అనుకొని ఎదురుచూస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ,మండలం,నందిపాడు గ్రామం ఉపాధి పనుల కోసం దేరంగుల ప్రసాద్ తన కుటుంబంతో కలిసి చీపురుగూడెంకు వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం సాయంత్రం వెళ్లారు. తమ ఐదేళ్ల పాప జాను పొరపాటున వేడివేడి నీళ్లలో పడటంతో శరీరంపై బాగా గాయాలయ్యాయి. వెంటనే పాపను కొత్తగూడెంలో చేర్పించగా అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ కు పంపించారు. ఇల్లు గడవక నానా యాతన పడుతున్న ఆ కుటుంబంపై మోయరాన్ని భారం పడింది. తమ పాప చికిత్స కోసం దాతలు దయాత్ర హృదయం కలవరు ఆపదలో ఆదుకునే పెద్ద మనసు కలిగిన వారు ఎవరైనా తమకు సాయం చేయకపోతారా అంటూ నిరీక్షస్తున్నారు. దాతలు ఎవరైనా ఉంటే గొంది అలివేణి -9398227663 నంబర్ కు ఆర్థిక సాయం పంపించాలని వేడుకుంటున్న బాధితులు.

# స్వర్ణ నంది అవార్డు అందుకున్న మాదా శ్రీరాములు

**సందేశం టైమ్స్**

స్వర్ణ అంది ఎక్సలెన్స్ అవార్డ్స్ విశ్వజనని స్వర్ణ నంది అవార్డు హైదరాబాద్ వారి సన్మాన కార్యక్రమంలో కొత్తగూడెం నివాసి మాజీ కౌన్సిలర్ నంది అవార్డు గ్రహీత మాధ శ్రీరాములు సోషల్ ఆర్గనైజేషన్ సర్వీస్ చేసినందున స్వర్ణ నంది అవార్డును ప్రధానం చేసినారు. స్వర్ణ నంది అవార్డు ఫౌండర్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం ఆలపాటి రామారావు అనుముల లక్ష్మణరావు ఏసి ఫంక్షన్ హాల్ నందు గవర్నమెంట్ హాస్పిటల్ వెనుక హనుమాన్ పేట్ విజయవాడ నందు స్వర్ణ నంది అవార్డు అందుకున్న మాధ శ్రీరాములు. ఈ కార్యక్రమంలో హై కోర్ట్ అడ్వకేట్ ఎల్ యన్ ప్రసాద్ సినీ యాక్టర్ బాలాజీ శ్రీశ్రీశ్రీ త్రిదండి భక్తి సుందర్ మంగల్ మహారాజ స్వామీజీ గౌడియామటం మంగళగిరి వారు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.